సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 4 । జూలై । 2024



ఆదర్శంగా తీసుకోవాలి
శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. - 9లో



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి
కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అన్ని విధాలా పురోగతి సాధిస్తాయని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. - 9లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
35^{0} / 25^{0}
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు గుట్టలోనే అనువైన భవనం

యాదగిరిగుట్ట : జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను యాదగిరిగుట్ట పట్టణంలోనే కొనసాగించాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. భువనగిరి పట్టణ శివారులోని పాత కలెక్టరేట్ భవనంలో లీజు ప్రాతిపదికన కళాశాల ప్రారంభించపోతున్నట్లు తెలిసిందని, యాదగిరిగుట్ట పట్టణంలో అన్ని విధాలా అనువైన భవనం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ భవనంలో మౌలిక సౌకర్యాలన్నీ ఉన్నాయని, 00 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించవచ్చన్నారు. కాబట్టి పాత కలెక్టరేట్ భవనంలో కాకుండా గుట్టలో ఉన్న భవనంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు ఆమె తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు

భువనగిరి : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ విద్యారంగాన్ని అప్పగించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బంద్‌కు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గ ఉదయ్, నాయకులు కార్తీక్, సతీష్, వరుణ్ పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు. స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కై ంకర్యాలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయానికి ద్వార బంధనం చేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రాజాపేట : మండలంలోని కుర్రారం గ్రామంలో బుధవారం సేవా స్ఫూర్తి ఫౌండేషన్, జాతీయ పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ వారి సహకారంతో నేరుగా విత్తే వరిలో సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, కలుపు, పురుగుల నివారణలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు వివరించారు. జాతీయ వరి పరిశోధన సంస్థ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వరి సేద్యంలో అవలంబించాల్సిన విధానాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ఏఓ మాధవి, ఏఈఓ అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలన

నేటితో ముగియనున్న మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం



భూదాన్‌పోచంపల్లి ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడి

- మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- ఎన్నికలు నిర్వహించే వరకు కొనసాగింపు
- మాజీలు కానున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు
- హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేపోయామన్న అసంతృప్తి

సాక్షి,యాదాద్రి : జెడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా కొనసాగుతున్న ప్రజాప్రతినిధులు మాజీలు కానున్నారు. గురువారంతో వారి పదవీకాలం ముగియనుంది. గ్రామ పంచాయతీల మాదిరిగానే వారి స్థానంలో ప్రత్యేకాధికారులు కొలువుదీరనున్నారు. ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక పాలన కొనసాగనుంది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ప్రాదేశిక సభ్యులు.. గడిచిన ఐదేళ్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

2019 జూలై 5న కొలువుదీరిన పాలకవర్గాలు

మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక వర్గాలు 2019 జూలై 5వ తేదీన కొలువుదీరాయి. జిల్లాలో జెడ్పీటీసీలు 17, ఎంపీటీసీలు 177 స్థానాలు ఉన్నాయి. 17మండల ప్రజా పరిషత్‌లు ఉన్నాయి. ఎంపీటీసీలు మండల పరిషత్ అధ్యక్షున్ని, జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. ఈ రెండింటి పాలకవర్గాల పదవీ కాలం గురువారంతో ముగియనుంది. మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉండనున్నారు.

కొన్ని పనులు పూర్తి.. మరికొన్ని పెండింగ్

జెడ్పీటీసీలు, ఎంపీటీసీల ఐదేళ్ల పదవీకాలం వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్, స్పెషల్ గ్రాంట్ కింద నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తికాగా, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఆశించిన మేర నిధులు మంజూరు కాకపోవడంతో ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయామన్న అసంతృప్తి, నిరాశ సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

మారిన రాజకీయ సమీకరణలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. వివిధ పార్టీల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా గెలుపొందిన వారిలో పలువురు పార్టీలు మారారు.

బీబీనగర్ మండలంలో..

బీబీనగర్ జెడ్పీటీసీ గోళి ప్రణీతా పింగళ్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే జంపల్లి, జమీలాపేట, నెమురగొముల ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్‌లోకి, గూడూరు ఎంపీటీసీ బీజేపీ కండువా కప్పుకున్నారు.

- **వలిగొండ** : రెడ్లరేపాక గ్రామ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- **భువనగిరి** : బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎంపీపీ నరాల నిర్మల.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరారు.
- **చౌటుప్పల్** : కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి కొద్ది రోజులకే బీఆర్ఎస్‌లో చేరారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన పంతంగి ఎంపీటీసీ బీజేపీలోకి వెళ్లారు. దండుమల్కాపురం ఎంపీటీసీ, ఆరెగూడెం ఎంపీటీసీలు బీజేపీలో చేరారు.
- **రామన్నపేట** : కన్నెబోయిన జ్యోతి(కాంగ్రెస్) ఎంపీపీగా ఎన్నికై న అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం విపక్ష సభ్యులు అవిశ్వాసం ప్రతిపాదించడంతో ముందుగానే ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో ఇంద్రపాలనగరం ఎంపీటీసీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రామన్నపేట జెడ్పీటీసీ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. శాసనసభ ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు.
- **మోత్కూరు** : మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు చొప్పున గెలుచుకున్నాయి. కాంగ్రెస్ ఎంపీటీసీ దీటీ సంధ్యారాణి డ్రాలో ఎంపీపీ అయ్యారు. తదనంతరం చోటు చేసుకున్న పరిణామాల కారణంగా ఆమె కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులివ్వలేదని తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. అలాగే కాంగ్రెస్ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ జెడ్పీటీసీ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.
- **సంస్థాన్‌నారాయణపురం** : బీఆర్ఎస్ నుంచి గెలుపొంది ఎంపీపీగా ఎన్నికై న గుత్తా ఉమాదేవి.. మునుగోడు ఉప ఎన్నిక ముందు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి కాంగ్రెస్ లో చేరారు. కంకణాలగూడెం, చిల్లాపురం, గుడిమల్కాపురం ఎంపీటీసీలు పార్టీలు మారారు. ఎంపీపీ గుత్త ఉమాదేవిపై బీఆర్ఎస్ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. గుజ్జ ఎంపీటీసీ దోడ వినోద్‌రెడ్డి అకాలమరణం చెందారు.
- **అడ్డగూడూరు**: బీఆర్ఎస్ నుంచి గెలిచిన డి.రేపాక ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరారు.
- **గుండాల** : అంబాల ఎంపీటీసీ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
- **బొమ్మలరామారం** : మర్యాల ఎంపీటీసీ బీఆర్ఎస్ నుంచి గెలచి బీజేపీలో చేరారు.
- **ఆలేరు** : వైస్ ఎంపీపీ గాజుల లావణ్య కాంగ్రెస్ గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరారు. శాసనసభ ఎన్నికల ముందు తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చారు.
- **మోటకొండూర్** : బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాటూరు ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు.
- **యాదగిరిగుట్ట** : ఇండిపెండెంట్‌గా గెలిచిన దాతరుపెల్లి ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరారు.
- **రాజాపేట** : బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన చల్లూరు ఎంపీటీసీ వారం రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన సింగారం ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరారు.
- **తుర్కపల్లి** : నాగాయపల్లి ఎంపీటీసీ కోమటిరెడ్డి సంతోష భాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా కాంగ్రెస్‌కు చెందిన మోతిరాంతండా ఎంపీటీసీ కారెక్కారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

భువనగిరి : కళాకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ కళాకారుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కళాకారులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అర్హులకు ప్రతి నెలా రూ.4వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల శంకర్, నాయకులు ఎలేంద్ర, అండాలు, సరిత, మణెమ్మ, కవిత, రేణుక, కిష్టమ్మ, వసంత పాల్గొన్నారు.


ఇంకొన్నాళ్లు అక్కడే విధులు!

- బదిలీ అయినా రిలీవ్ కాని ఎస్‌జీటీలు
- కొత్తవారు వచ్చేదాకా పాత స్థానాల్లోనే డ్యూటీ
- నిరాశలో 150 మంది ఉపాధ్యాయులు

నిబంధనల ప్రకారంగానే..

నిబంధనలకు అనుగుణంగానే ఎస్‌జీటీల బదిలీలు జరిగాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలి. ఆ విధంగా ఉంటేనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయి.

–నారాయణరెడ్డి, డీఈఓ



భువనగిరి : బదిలీల కోసం ఏళ్లుగా ఎదురుచూసిన ఎస్‌జీటీలకు నిరాశే మిగిలింది. బదిలీ ఉత్తర్వులు వెలువడినా.. కొత్త స్థానాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రేషనలైజేషన్ నిబంధనలు పాటించాలని రాష్ట్ర విద్యాశాఖ పేర్కొనడంతో.. కొత్తవారు వచ్చేవరకు పాత స్థానంలోనే పనిచేయాల్సి ఉంటుంది.

జీఓ 25 ప్రకారం..

ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 598 మంది ఎస్‌జీటీలకు ఈనెల 30న బదిలీలు ముగిశాయి. 1వ తేదీన కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. కానీ, 2021లో విడుదలైన రేషనలైజేషన్ జీఓ 25 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 10 లోపు విద్యార్థులుంటే ఒక్కరు, 20లోపు అయితే ఇద్దరు, 30 దాటితే ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేయాలి. పాఠశాలల్లో విద్యార్థులుండి బదిలీ అయిన ఉపాధ్యాయులు రాకుంటే పాతవారిని రిలీవ్ చేయొద్దని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు జిల్లాలో సుమారు 150 మంది ఎస్‌జీటీలను రిలీవ్ కాలేదు. ఈ పరిస్థితి జిల్లాలో గుండాల, అడ్డగూడూరు, రాజాపేట, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లో అధికంగా ఉంది. రేషనలైజేషన్ సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు ఉంటేనే బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలి. ఉపాధ్యాయులు తక్కువ ఉంటే చేయవద్దన్న నిబంధన ఉంది.

డీఎస్సీ నిర్వహించిన తర్వాతే..

డీఎస్సీ నిర్వహించి కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు బదిలీ అయిన ఎస్‌జీటీలు పాతస్థానాల్లోనే పనిచేయవల్సి ఉంటుంది. ఈ నెలలోనే డీఎస్సీ జరగనుంది. ఫలితాలు వెలువడి, అభ్యర్థులకు పోస్టులు ఇవ్వడానికి సుమారు మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు బదిలీ అయిన ఎస్‌జీటీలు పాత స్థానాల్లోనే పని చేయాల్సి ఉంటుంది.

హాస్టళ్లలో పరిశుభ్రత తప్పనిసరి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



వసతి గృహాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జండగే

సాక్షి, యాదాద్రి : వసతి గృహాల్లో విధిగా పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ హాస్టళ్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బియ్యం, పప్పు, నూనె, దినుసులు తదితర సరుకులను వంట చేయడానికి ముందు పరిశీలించాలని, నాణ్యవంతంగా ఉంటేనే వినియోగించాలని పేర్కొన్నారు. నిత్యావసర సరుకులతో పాటు స్టోర్ రూంను తరచూ పరిశీలిస్తుండాలన్నారు. నిత్యావసర సరుకుల ఇండెంట్, రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. వర్షాకాలం అయినందున పొడి వాతావరణంలో వంట సామగ్రి భద్రపర్చాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తంగా ఉండాలని, ఏచిన్న సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని, ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలని, పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్పష్టం చేశారు. భోజనశాల, వంట గదులను శుభ్రంగా ఉంచాలన్నారు. టాయిలెట్లను రోజూ ఉదయం, సాయంత్రం శుభ్రం చేస్తుండాలని వివరించారు. వంటలను, విద్యార్థుల ఆరోగ్యాన్ని రోజూ పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి వసతి గృహాలను పర్యవేక్షిస్తుండాలని, అధికారులను అప్రమత్తం చేస్తుండాలని ఆర్‌సీఓకు సూచించారు. ఈసమావేశంలో సంక్షేమ హాస్టళ్ల రీజినల్ కోఆర్డినేటర్ రజనీ, వార్డెన్లు పాల్గొన్నారు.

రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ

చౌటుప్పల్ : రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు చౌటుప్పల్ పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. రైతులను ఇబ్బందిపెట్టేలా ప్రభుత్వం వ్యవహరించవద్దన్నారు.తెల్లరేషన్ కార్డు ఉండాలని, ఐటీ చెల్లించేవారికి, ఉద్యోగులకు రైతుభరోసా ఇవ్వమని కొర్రీలు పెట్టవద్దని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ దేవ్‌సింగ్ మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి మా ట్లాడుతూ రైతులందరికీ పంటసాయం అందజేస్తే పంటల సాగు పెరుగుతుందన్నారు. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సహకరించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చీరిక సంజీవరెడ్డి, పీఏసీఎస్ సీఈవో ఎరుకల రమేష్, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు

భువనగిరి : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి మాట్లాడుతూ.. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500, కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, కళాశాలకు వెళ్లే యువతులకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా హామీలు నెరవేర్చడం లేదన్నారు. మాట నిలబెట్టుకోకపోతే బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సుమిత్ర, వైజయంతి, లక్ష్మి, శ్రావణి, మాదవి, రేఖ, రమ, అర్చన, మల్లీక, కీర్తి, కనకమ్మ, శైలజ, రమ్య, రేణుక, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

4 లేన్లుగా వలిగొండ రోడ్డు విస్తరణ

- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 1.4 కిలో మీటర్ల మేర వెడల్పు
- హైవే నుంచి తాళ్లసింగారం క్రాస్ రోడ్డు వరకు..
- రూ.10 కోట్లు మంజూరు
- త్వరలోనే పనులు ప్రారంభం



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి నుంచి ఫోర్ లేన్‌గా మారనున్న వలిగొండ రోడ్డు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో చౌటుప్పల్ - వలిగొండ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. తొలుత జాతీయ రహదారి నుంచి తాళ్లసింగారం క్రాస్ రోడ్డు వరకు 1.4 కిలో మీటర్ల మేర విస్తరించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయి. పనులకు సంబంధించి అగ్రిమెంట్ కూడా కుదిరింది. టెండర్లు పిలవాల్సి ఉంది. అలాగే మలి విడతలో తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు నుంచి లింగారెడ్డిగూడెం శివారు వరకు 2.1 కిలో మేర విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. నిర్మాణ వ్యయం రూ.18 కోట్లుగా అంచనా వేసి ప్రభుత్వానికి పంపించారు. మొత్తం 3.5 కి. మీ మేర రోడ్డు విస్తరించనున్నారు. ఇరు వైపులా 21 మీటర్లు వెడల్పు(ఫుట్‌పాత్‌ల వరకు) చేయనున్నారు. ఇందులో రోడ్డు నిర్మాణ భాగం 14 మీటర్లు కాగా డివైడర్ 2.2 మీటర్లు రానుంది. నిర్మాణాల కూల్చివేత లేకుండానే రోడ్డు విస్తరణ చేపట్టడానికి అవకాశం ఉండడం శుభపరిణామంగా చెప్పుకోవచ్చు.

ఇప్పటికే తంగడపల్లి రోడ్డు విస్తరణ పూర్తి

చౌటుప్పల్ పట్టణం నుంచి సంస్థాన్‌నారాయణపురం మీదుగా నల్లగొండకు వెళ్లే రహదారిని మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి వరకు రెండు వరుసలుగా విస్తరించారు. రోడ్డు మధ్యలో డివైడర్ కూడా ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ పనులు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. ఇక చిన్నకొండూర్ రోడ్డు నుంచి వలిగొండ మండలం సంగెం వరకు కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ రోడ్డు ఫండ్ రూ.18 కోట్లతో చేపట్టిన విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డును రెండు లేన్లుగా విస్తరిస్తున్నారు. త్వరలోనే నిర్మాణాలను తొలగించనున్నారు.

ప్రమాదాలు తగ్గుతాయి



చౌటుప్పల్ నుంచి వలిగొండ మండలం నాగారం మీదుగా భువనగిరికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయి. ప్రయాణం కూడా సులువుగా మారుతుంది. అంతేకాకుండా ఈ మార్గంలో వ్యాపారాలు విస్తరిస్తాయి. విస్తరణలో ఇళ్లు, దుకాణదారులకు నష్టం జరగకుండా చూడాలి.

–ఢిల్లీ మాధవరెడ్డి, చౌటుప్పల్

మంత్రి, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



చౌటుప్పల్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. అందు కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ముందుకెళ్తున్నాం. ప్రధానంగా చిన్నకొండూర్, తంగడపల్లి, వలిగొండ రోడ్లను విస్తరించాలని నిర్ణయించాం. ఇప్పటికే తంగడపల్లి రోడ్డు విస్తరణ పూర్తయ్యింది. వలిగొండ రోడ్డును 3.5కి.మీ నాలుగు లేన్లుగా విస్తరిస్తున్నాం. ప్రజలు సహకరించాలి.

–వెన్‌రెడ్డి రాజు, మున్సిపల్ చైర్మన్, చౌటుప్పల్

పట్టణానికి నూతన శోభ

చౌటుప్పల్ పట్టణం గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఎన్నో మండలాలకు ప్రధాన కూడలిగా ఉంది. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు విస్తరించి ఉండడం, హైదరాబాద్‌కు చేరువలో ఉన్నందున శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించింది. అందులో భాగంగా రహదారులను విస్తరణపై దృష్టి సారించింది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా రహదారుల విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇస్తుండడంతో ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రధాన రహదారుల విస్తరణతో చౌటుప్పల్ పట్టణం నూతన శోభను సంతరించుకుంటోంది.

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ వీరబాబు

పెద్దవూర: పోయిన సెల్ ఫోన్‌ను వెతికి పట్టుకున్న పోలీసులు బుధవారం బాధితునికి అప్పగించారు. పెద్దవూర ఎస్‌ఐ పి.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దవూర మండలం చింతపల్లి గ్రామానికి చెందిన చిన పాక జానయ్య సెల్ ఫోన్ పోయిందని గత ఫిబ్రవరి 8న పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం వివరాలతో బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం ఫోన్ నంబర్‌ను ఫిర్యాదులో పొందుపర్చాలని సూచించారు. ఆయా వివరాలతో పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం పోగొట్టుకున్న ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేసి, ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్ సహాయంతో సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని రాంనగర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న పది మందిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారినుంచి రూ.43 వేల నగదు, ఐదు బైక్‌లు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న గుట్కా ప్యాకెట్లు

వలిగొండ: మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న రూ.50 వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం పట్టుకుని సీజ్ చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రంలో రాందేవ్ కిరాణం–జనరల్ స్టోర్ యజమాని చేతన్ ప్రకాష్ వివిధ కంపెనీలకు చెందిన నిషేధిత గుట్కాలను అమ్ముతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి సీజ్ చేసి స్థానిక పోలీసులకు స్వాధీన పరిచారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

15 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురు వ్యక్తుల అరెస్టు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో బుధవారం డీసీఎంలో 15 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేషన్ లబ్ధిదారుల వద్ద కొందరు వ్యక్తులు కిలో రూ.9 చొప్పున కొనుగోలు చేసి మిల్లులకు అమ్ముతున్నారు. ఇదే క్రమంలో కొనుగోలు చేసి డీసీఎంలో తరలిస్తుండగా పట్టణంలోని డీఈఓ కార్యాలయ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు తెలిపారు. చైతన్యపురి కాలనీకి చెందిన డీసీఎం డ్రైవర్ భిక్షం, పానగల్లుకు చెందిన వెంకటరమణ రైస్‌మిల్లు యజమాని బండారు రాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



డీసీఎం నుంచి బియ్యం బస్తాలను స్టేషన్ ఆవరణలో దిగుమతి చేయిస్తున్న పోలీసులు

చాయ్, బిస్కెట్లకే పరిమితమైన పదవి

- ఐదు సంవత్సరాల పదవీకాలంపై ఓ ఎంపీటీసీ సభ్యుడి ఆవేదన

కోదాడ రూరల్: మూడు నెలలకు ఓసారి నిర్వహించే జనరల్‌బాడీ సమావేశాలకు హాజరై చాయ్, బిస్కెట్లు తీసుకోవడానికే తమ పదవులు పరిమితమయ్యాయని ఓ ఎంపీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కావడంతో బుధవారం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ తన ఆవేదన వెలిబుచ్చారు. ఐదేళ్ల పదవీకాలంలో ఎంపీటీసీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో ప్రజలకిచ్చిన హామీలను నెవేర్చలేకపోయాయనని బాధపడ్డారు. తన పదవీకాలం మొత్తంలో కేవలం రూ.5లక్షల నిధులు మంజూరయ్యాయని వాటితో ఏం పనులు చక్కబెట్టాలన్నారు. సర్పంచ్‌ల మాదిరిగానే తాము ప్రజలతో ఎన్నుకోబడ్డప్పటికీ తమకు ఎలాంటి నిధులు లేవని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కానీ, మండల పరిషత్ భవనంలో కానీ తమకు కనీసం కూర్చోకూడా లేదనే విషయం ఎంపీటీసీ అయ్యాకే తెలిసిందని వాపోయారు. ఇప్పటి నుంచైనా ఎంపీటీసీలకు కనీస నిధులు మంజూరు చేయాలని, సర్పంచ్‌లతో సమానంగా పంచాయతీల్లో ఓ గది కేటాయించాలని లేదంటే ఎంపీటీసీల వ్యవస్థను రద్దు చేసి డైరెక్ట్‌గా ఎంపీపీని ఎన్నుకునే విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పార్లమెంట్‌లో నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోదీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

భానుపురి (సూర్యాపేట): పార్లమెంట్ సమావేశాల్లో నీట్ పేపర్ లీకేజీ, మణిపూర్ హింస, అగ్నిపథ్, రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే ప్రధాని మోదీ నిరంకుశంగా వ్యవహరించడం తగదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రజా సమస్యలపై మోదీ మాట్లాడకుండా ఎదురు దాడి చేయడంలో అర్థం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లాభాల బాటలో ఉన్న సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానికి కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు అని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్లు లక్ష్మి,కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్ రావు, మట్టిపల్లి సైదులు, నగారపు పాండు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం

కోదాడ రూరల్: రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకే ప్రత్యేక మహాజన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీసీఓ పద్మ చెప్పారు. బుధవారం కోదాడ పీఏసీఎస్‌తో పాటు ఎర్రవరం, కాపుగల్లు పీఏసీఎస్‌లలో రైతులతో నిర్వహించిన ప్రత్యేక మహాజన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. గత నెల 29 నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల్లో ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కొద్ది మంది రైతులు 5 ఎకరాల లోపు అంటే మరికొద్ది మంది 10 ఎకరాల వరకు అంటే ఇంకొందరు సాగుభూమి అంతటికీ ఇవ్వాలని కోరుకుంటున్నారని చెప్పారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు, బీడుభూములకు, గుట్టలకు ఇవ్వొద్దని చెప్పారని అన్నారు. ఎక్కువ మంది రైతులు మాత్రం 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు ఇవ్వాలని కోరారన్నారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇందిర, పీఏసీఎస్ చైర్మన్‌లు ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, నలజాల శ్రీనివాసరావు, నంబూరి సూర్యం, ఏఓ పాలెం రజిని, సీఈఓలు మంద వెంకటేశ్వర్లు, ఎస్‌కె.హుస్సేన్, డైరెక్టర్‌లు , రైతులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ పద్మ

పొలం వద్ద ట్రాక్టర్ అపహరణ

బీబీనగర్: వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బీబీనగర్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్దుంపల్లి గ్రామానికి చెందిన పాదం పాండు తన వ్యవసాయ బావి వద్ద పొలం దున్నడం కోసం తన సొంత ట్రాక్టర్‌ను మంగళవారం తీసుకొచ్చి పొలం వద్దే ఉంచాడు. కాగా బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ లేకపోవడంతో స్థానిక రైతులను అడిగాడు. వారు తమకు తెలియదని చెప్పడంతో ట్రాక్టర్ చోరీకి గురైందని నిర్ధారించుకున్న పాండు.. వెంటనే బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

- ఇంజన్ ముందు భాగంలో ఇరుక్కుని ఘట్‌కేసర్ వరకు రైలు వెంటే వెళ్లిన మృతదేహం

బీబీనగర్: బీబీనగర్‌లో మంగళవారం రాత్రి రైల్వే గేటు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడిని రైలు ఢీకొని మృతిచెందాడు. ఇంజన్ ముందు భాగంలో మృతదేహం ఇరుక్కుని అలాగే ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వరకు వెళ్లింది. రైలింజన్‌కు మృతదేహం తట్టుకుని ఉండడంతో అక్కడ గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైల్వే పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడు మృతి

చిట్యాల: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడిన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేట గ్రామానికి చెందిన దోమల మల్లిఖార్జున్(33) సుతారి మేస్త్రీ పనిచేస్తూ చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పదేళ్లుగా జీవనం సాగిస్తున్నాడు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం వెలిమినేడులో ఓ ఇంటిపై లిప్టు సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో కార్మికుడికి తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

తిరుమలగిరి: మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి ఎస్‌ఐ సత్యనారాయణ గౌడ్ బుధవారం తమ పోలీస్ సిబ్బందితో కలిసి తిరుమలగిరి మండలం జలాల్‌పురం ఎక్స్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఒయ్య వినోద్, ఎస్.చక్రపాణి అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని సోదా చేయగా వారి వద్ద 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఇరువురిని విచారించగా తాము సేవిస్తూ తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్నామని ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. గంజాయి అమ్ముతున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని సీఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మర్రిగూడ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం మర్రిగూడ మండలం తమ్మడపల్లిలో చోటు చేసుకుంది. మర్రిగూడ ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఏఎస్ పేట మండలం జమ్మవరం గ్రామానికి చెందిన నారె వెంకట్‌రావు (36) హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రావు భార్య అనిత తండ్రి నాగిళ్ల పకీరా దశదిన కర్మకు సోమవారం హాజరయ్యారు. వెంకట్‌రావు తన ఇద్దరు సడ్డకులతో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై మాల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గ్రామంలోని మూలమలుపు వద్ద ఉన్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ దిమ్మను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్‌రావు మంగళవారం రాత్రి మృతిచెందాడు. వెంకట్‌రావు తండ్రి నారె రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతుడు వెంకట్‌రావు

తండ్రికి కూతురు తలకొరివి

హుజూర్‌నగర్: ఓ కూతురు.. తండ్రికి తలకొరివి పెట్టింది. ఈ సంఘటన బుధవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ వుదారి క్రాంతి కుమార్ (38) భార్య పార్వతితో కలిసి ఉంటున్నారు. 13 ఏళ్ల క్రితం వారికి ఒక కూతురు జోత్స్న పుట్టగానే తల్లి పార్వతి మరణించింది. దీంతో జోత్స్న నాయనమ్మ పుష్పావతి వద్ద పెరిగింది. భార్య లేకపోవడంతో క్రాంతి కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కూతురు జోత్స్న తలకొరివి పెట్టింది. ఈ సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది. కాగా జోత్స్న ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 7తరగతి చదువుతోంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన ఆ చిన్నారిని దయాహృదయులు ఆదుకోవాలని పలురువు కోరుతున్నారు.



తలకొరివి పెడుతున్న జోత్స్న

మిస్సింగ్ కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెంలోని హెజిలో కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తి మిస్సింగ్ అయినట్లు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, సురారం గ్రామానికి చెందిన ఎండీ ఇస్మాయిల్ పని నిమిత్తం గత నెల 26న మండలంలోని దోతిగూడెంలోని హెజిలో కంపెనీలో కార్మికుడిగా చేరారు. అదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుడైన రాంచంద్రారెడ్డి గదిలో ఈనెల 1న పడుకొన్న ఎండీ ఇస్మాయిల్ అర్ధరాత్రి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అనంతరం ఇస్మాయిల్ కన్పించపోయేసరికి రాంచంద్రారెడ్డి అతని అన్న అజ్మేరీకి సమాచారం ఇచ్చారు. దాంతో అతను బంధువులతో పాటు తెలిసిన చోట్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో బుధవారం అజ్మేరీ తన తమ్ముడు ఇస్మాయిల్ కన్పించడంలేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఇస్మాయిల్ (ఫైల్)

బ్రిడ్జి పైనుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతి

అడ్డగూడూరు: ప్రమాదవశాత్తు బ్రిడ్జి పైనుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామంలో బుధవారం సాయంత్ర చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చిర్రగూడూరు గ్రామానికి చెందిన మొలుగూరి శివ–ఉమారాణి దంపతుల కూతురు ఈషిత (3). బుధవారం సాయంత్రం శివ తన కూతురు ఈషితతో కలిసి బైక్‌పై గ్రామం సమీపంలోని బిక్కేరు వాగుపై ఉన్న బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో శివకు ఫోన్ రావడంతో బైక్‌ను బ్రిడ్జిపైన సైడ్‌కు స్టాండ్ వేసి గేర్‌లోనే ఉంచి మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో చిన్నారి ఈషిత బైక్ సెల్ఫ్‌ను నొక్కడంతో బైక్ ముందుకు వెళ్లి బ్రిడ్జి పైనుంచి కింద పడింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలలు కాగా, తండ్రి శివకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్సకోసం ఓ వాహనంలో తిరుమలగిరిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయమించడంతో అక్కడ నుంచి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



ఈషిత (ఫైల్)

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

అర్వపల్లి: సూర్యాపేట జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు, ఒక విద్యార్థి అదృశ్యమయ్యాడు. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఓ మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన అరిగె లక్ష్మమ్మ(45) గత నెల 20వ తేదీన ఆసరా పింఛన్ కోసమని ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్లకు వెళ్లి వెతకగా ఆచూకీ లభించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మమ్మ సోదరుడు కర్కాని వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కె.యాకూబ్ తెలిపారు. లక్ష్మమ్మ ఆచూకీ తెలిస్తే సెల్ : 87126 86041 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



లక్ష్మమ్మ (ఫైల్)

యడవెల్లిలో మరో మహిళ..

నూతనకల్: మహిళ అదృశ్యమైన సంఘటనలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నూతనకల్ ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం యడవెల్లికి చెందిన గాజుల అనిత గతనెల 29న ఉదయం 10గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని, బంధువులను అడగగా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త గాజుల ఉపేందర్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అనిత (ఫైల్)

కుడకుడలో విద్యార్థి..

చివ్వెంల: మండలంలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పరిధిలోని పానగల్‌కు చెందిన కొడిదల మహేష్ కుడకుడ గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 2న పాఠశాల ఇంటర్వెల్ సమయంలో తన తాతకు ఫోన్ చేసి నేను హాస్టల్‌లో ఉండను అంటూ చెప్పాడు. ఇంటికి రాకుండా ఎటో వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ బి.వెంకట్‌రెడ్డి తెలిపారు.

పంటల సాగులో ఎరువుల యాజమాన్యం

- సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు
- రసాయన ఎరువులతో తగ్గనున్న భూసారం
- రైతులకు పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ పేర్కొంటున్నారు. ఎరువుల యాజమాన్యానికి సంబంధించి రైతులు పాటించాల్సిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

రసాయన ఎరువులతో నష్టం..

రసాయన ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారం తగ్గుతుంది. మరోవైపు పంట ఉత్పత్తులలో రసాయన అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం తగ్గించాలి. వీటి వాడకం వలన క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

సేంద్రియ ఎరువులే మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువుల వల్ల అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. ఆ దిశగా రైతులు ఆలోచిస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చు. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.



పత్తిచేనుకు ఎరువు వేస్తున్న రైతు (ఫైల్)

పాడి పంట

ఎరువుల ధరలపై అవగాహన అవసరం..

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో.. వాటి ధరలపై అవగాహన కలిగి ఉండడం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఏ శాతం ఎంత ఉంటుంది. నాణ్యత, ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి. పోషకాలను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా మీద దానిలో ఉన్న పోషక విలువల శాతం స్పష్టంగా ఉంటుంది, అయితే సూచించిన దానికంటే పోషక విలువలు సగం శాతం మాత్రమే ఉంటాయనే విషయాన్ని గమనించాలి.

వెదజల్లే పద్ధతి..

సరైన పద్ధతిలో ఎరువులు వేయడం చాలా ముఖ్యం. సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్ల భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి చాలా మేలు చేస్తుంది.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరువులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు..

- లోతు దుక్కుల వల్ల భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- సమస్యాత్మక భూముల్లో ముందుగా ఉన్న సమస్యను సరిచేసుకుని ఆ తర్వాత ఎరువులు వేసుకుంటే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపి గానీ, యూరియా ఎరువుతో వేప నూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతూ వృథా తగ్గుతుంది.
- కోల్‌థార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగనిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.